సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



స్విఫ్ట్ చాట్
రాష్ట్రంలో డిజిటల్ విద్యాబోధనలో భాగంగా స్విఫ్ట్ చాట్ బాట్ పేరుతో యాప్‌ను అనుసంధానిస్తూ విద్యాశాఖ చర్యలు చేపట్టింది.
8లో ▸



యాదవులకు ప్రాధాన్యం
బీసీల్లో అధిక జనాభా ఉన్న యాదవులకు వైఎస్సార్ సీపీ అధిక ప్రాధాన్యమిస్తోందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.
8లో ▸



దేశవాళీ వరి రకాలే మేలు
ప్రకృతి వ్యవసాయంలో రైతులకు దేశవాళీ వరి రకాలే మేలు చేస్తాయని మార్టేరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సూచించారు.
8లో ▸

న్యూస్‌రీల్

ఓటు వినియోగం అందరి బాధ్యత


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటు వేయడం పౌరుల బాధ్యత అని, ఓటును పవిత్రంగా వేసినప్పుడే ప్రజాస్వామ్యానికి మార్గదర్శకమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటు హక్కు వినియోగ ప్రచార బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటికి రెండు సార్లు ఆలోచించి సమర్థ నాయకత్వానికి ఓటు వేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి మాట్లాడుతూ నెల రోజుల నుంచి పాఠశాలలు, కళాశాలలు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

'డయల్ యువర్ ఎస్పీ'కి 10 ఫిర్యాదులు

భీమవరం: ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడానికి, పోలీసులపై విశ్వాసాన్ని కల్పించడానికి డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. శుక్రవారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించగా 10 ఫిర్యాదులు అందాయన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఎవరికైనా సమస్యలుంటే సెల్ 90001 10289 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

- ఆకివీడుకి చెందిన వ్యక్తి ఫోన్ చేసి తాను ఇంటిని కొనుగోలు చేయగా ఇంటి పత్రాలు నకిలీవని తెలిసిందని ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆకివీడు పోలీసులను ఎస్పీ ఆదేశించారు.
- మొగల్తూరుకి చెందిన వ్యక్తి తన సరిహద్దుదారులు తమ భూమిని కొలుచుకోనివ్వకుండా అడ్డుపడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇది సివిల్ సమస్య కావడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.
- మరికొందరు ట్రాఫిక్ సమస్య, అసాంఘిక శక్తుల వల్ల ఇబ్బందులు, కుటుంబ కలహాలు వంటి వాటిని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.
- సంబంధిత పోలీస్‌స్టేషన్లు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

మోగల్లు కార్యదర్శి బదిలీ

పాలకోడేరు: మోగల్లు పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజు పోడూరు మండలం పండితవిల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయనపై గ్రామానికి చెందిన నేతల శ్యామ్‌కుమార్ పలు అభియోగాలు చేస్తూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బదిలీ చేశామని, తదుపరి చర్యలు తీసుకుంటారని పాలకోడేరు ఈఓపీఆర్డీ ఆంజనేయులు తెలిపారు

పండగలా వ్యవసాయం

ప్రజా ప్రస్థానం

నాడు చంద్రబాబు హయాంలో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం దుకాణాల వద్ద బారులు తీరే దృశ్యాలు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఆదుకునే నాథుడు లేక అన్నదాతల ఆత్మహత్యలు. విద్యుత్ సరఫరా అంతరాయాలు, పంటలు పండక, మద్దతు ధర లేక అప్పులపాలై దారుణ స్థితిలో కొట్టుమిట్టాడే సంఘటనలు.

నేడు సీఎం జగన్ హయాంలో పండగలా మారిన వ్యవసాయం. రైతుల కష్టానికి విలువ తెచ్చిన వైనం. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, పురుగు మందుల పంపిణీ, మట్టి పరీక్షలు, శాస్త్రవేత్తల సలహాలు. మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, రైతు భరోసా సొమ్ములతో అన్నదాతలు ఆనందంగా వ్యవసాయం చేస్తున్న దృశ్యాలు.

అన్నదాతకు అండ.. అభివృద్ధి అజెండా

- దళారుల దందాకు చెక్
- రైతు కష్టాలకు విలువ పెరిగింది
- గోదావరి జిల్లాలకు పోల'వరమే'
- చంద్రబాబు హయాంలో దోపిడీ
- 'సాక్షి మీడియా' చర్చాగోష్టిలో వక్తలు

ఏలూరు టౌన్ : ఏలూరులో 'సాక్షి మీడియా' ఆధ్వర్యంలో మన రాష్ట్రం–మన రైతు అనే అంశంపై రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, రైతు నేతలు, రైతులు, ఆయా వర్గాల ప్రజలతో ప్రత్యేకంగా చర్చాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు, మారిన రైతుల జీవన ప్రమాణాలు, ఆక్వారంగంలో మార్పులు, పోలవరం ప్రాజెక్టు పనులు, గ్రామాల అభివృద్ధి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యం, గత టీడీపీ హయాంలో చంద్రబాబు వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిన వైనం తదితర అంశాలపై వక్తలు మాట్లాడారు. ఆయా వర్గాల ప్రశ్నలకు మంత్రులు సమాధానాలిచ్చారు.


ప్రజా ప్రస్థానం చర్చావేదికలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


హాజరైన రైతులు, రైతు విభాగ నాయకులు

మహిళల అభ్యున్నతికి..



రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన సాధించేలా సీఎం జగన్ తోడుగా నిలిచారు. మహిళలు స్వయం ఉపాధి పొందేలా పలు సంక్షేమ పథకాలు అందిస్తూ భరోసాగా ఇస్తున్నారు. నేడు మహిళలు కుటుంబాలను పోషించుకునే స్థాయికి ఎదిగారు. సీఎం జగనన్న హయాంలో రాష్ట్రంలో పేదరికాన్ని 6 శాతానికి తగ్గించారు.

– ఘంటా పద్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్

వైఎస్సార్‌సీపీ ఘనత



ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో 30 వేల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఒక్కో మహిళకు సుమారు రూ.10 లక్షలు లబ్ధి చేకూరింది. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు సైతం వేగంగా జరుగుతున్నాయి. ఇదంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఘనతే.

– జిజ్జువరపు విజయనిర్మల, కార్పొరేటర్, ఏలూరు

గ్రామ స్వరాజ్య స్థాపన



సీఎం జగన్ ఊహించని స్థాయిలో పాలన అందిస్తూ గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారు. గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ ఇలా ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట స్థానికంగా అందిస్తున్నారు. ప్రపంచస్థాయి వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ సైతం సీఎం జగన్ అవలంబిస్తున్న రైతు విధానాలపై 'నేను కోరుకున్న కలలను సాకారం చేస్తోన్న ఏకైక సీఎం జగనే' అంటూ ప్రశంసించారు. రాష్ట్రంలో పథకాలు, విధానాలపై ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయి. ఆర్‌బీకేల ద్వారా అవగాహన, చైతన్యం, మార్కెటింగ్ విధానాలతో రైతులకు భరోసా కల్పిస్తున్నారు.

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి

దళారీ వ్యవస్థకు చెక్



సీఎం జగన్ వ్యవసాయాన్ని పండగలా మార్చారు. చంద్రబాబు వ్యవసాయాన్ని దండగ అంటూ రైతుల నడ్డివిరిచే ప్రయత్నం చేశారు. నేడు గ్రామస్థాయిలో రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు దళారీ వ్యవస్థకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టాం. తుపాన్లలో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ములు జమచేశాం. ఆర్‌బీకేల్లో పురుగు మందులు, విత్తనాలు, మట్టి పరీక్షలు, రైతులకు సలహాలు, సూచనలు అందిస్తూ అండగా నిలుస్తున్నాం. వ్యవసాయ వృద్ధి రేటు గతంలో 3.5 శాతంగా ఉంటే ప్రస్తుతం 11 శాతానికి పెరగటం శుభపరిణామం.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి

బాబు భజనకు రూ.80 కోట్లు



నాడు చంద్రబాబు కట్టని పోలవరం ప్రాజెక్టును చూపించి భజన కోసం రూ.80 కోట్లు నిధులు ఖర్చు చేశారు. ప్రజలను మభ్య పెడుతూ విపరీతంగా ప్రచార ఆర్భాటాలు చేశారు. నేడు సీఎం జగన్ మూగజీవాల కోసం 840 పశువైద్య సంచారశాలలను ఏర్పాటు చేయడంతో పాటు 295 మంది పశు వైద్యులను నియమించారు. 51 రకాల మందులను అందుబాటులో ఉంచడంతో పాటు ల్యాబ్‌లు ఏర్పాటు చేసి దార్శనికత చూపారు. చంద్రబాబు హెరిటేజ్ కోసం డెయిరీలను నాశనం చేస్తే నేడు జగన్ అమూల్ సంస్థ ద్వారా పాలను సేకరిస్తూ పాడి రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నారు.

–పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎమ్మెల్యే

ఆక్వా రంగానికి పెద్దపీట



రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని సీఎం జగన్ ఆదుకున్నారు. దేశవ్యాప్తంగా రూ.48 వేల కోట్ల ఆక్వా ఎగుమతులు ఉంటే మన రాష్ట్రం నుంచే రూ.38 వేల కోట్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయి. సీఎం జగన్ హయాంలో ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ తీసుకువచ్చి ఆక్వా రైతులకు అండగా నిలిచారు. రైతుకు రూ.3,420 కోట్ల లబ్ధి చేకూర్చారు. గతంలో చంద్రబాబు ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అంటూ దారుణంగా మోసం చేశారు. నేడు ఆక్వా జోన్‌లోని 10 ఎకరాలలోపు రైతులకు విద్యుత్ రాయితీలు ఇస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కింది.

– వడ్డీ రఘురామ్, ఎంపెడా వైస్ చైర్మన్

జగన్ హయాంలోనే మేలు



పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55 వేల కోట్లయితే చంద్రబాబు హయాంలో ఖర్చు చేసింది రూ.10,500 కోట్లు. దానిలో ఆయన మద్దతుదారులకు రూ.2 వేల కోట్లకు పైగా ధారాదత్తం చేయగా ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎలా చేశారో ప్రజలకు తెలుసు. సీఎం జగన్ చుక్కల భూములు, 21(ఎ), ఎస్సీల అసైన్డ్ ల్యాండ్‌ల సమస్యలకు పరిష్కారం చూపారు.

– వాసిరెడ్డి మధు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు

రైతు ఆత్మహత్యలు ఆగిపోయాయి



ఆనాడు చంద్రబాబు హయాంలో తీవ్ర వర్షాభావంతో పంటలు పండక, గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. నేడు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్నివిధాలా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా అరటి పంటకు నష్టపరిహారం ఇచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.

– బూరుగుపల్లి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి

ఆర్‌బీకేలతో అండగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. స్థానికంగానే రైతులకు అన్ని సేవలు అందుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతుందనే విశ్వాసం ఉంది. చంద్రబాబు రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఇబ్బందులు పెట్టారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేశారు.

– గొర్రెల సాంబశివరావు, రైతు, పాలగూడెం

మా జగన్ అంటూ..



రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ముఖ్యమంత్రిని మా జగన్ అంటూ కుటుంబసభ్యుడిలా భావిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ దివంగత వైఎస్సార్. నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ హయాంలో ప్రాజెక్టును పూర్తి చేస్తారనే నమ్మకం ఉంది. చంద్రబాబు ఆయిల్‌పామ్ రైతులకు రూ.84 కోట్లు బకాయిలు పెట్టి మోసం చేశారు.

– ఈ.సాంబశివరావు, ఏపీ రైతు సమాఖ్య నాయకుడు

గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

భీమవరం: ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లు, లైజాన్ ఆఫీసర్లు, అబ్జర్వలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న గ్రూప్–2 పరీక్షలకు జిల్లాలో 37 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో డివిజన్ల వారీగా భీమవరంలో 21, నరసాపురంలో 3, తాడేపల్లిగూడెం 13 కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తంగా 14,546 మంది హాజరు కానున్నారని, సమన్వయ అధికారిగా జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డిని నియమించామన్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, గర్భిణులు, దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు గుర్తింపు కార్డుతో ఉదయం 9.30 గంటల నుంచి 10.15 గంటలలోపు హాజరు కావాలని సూచించారు. ఆర్డీఓలు, ఏపీపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.


పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న కలెక్టర్

అందుబాటులో ఆర్టీసీ బస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రూప్–2 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కేంద్రాలకు చేరుకునేందుకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బస్సులను నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి తెలిపారు. పరీక్షలు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతున్న నేపథ్యంలో అభ్యర్థుల సౌకర్యార్థం బస్సులు నడుపుతామన్నారు.

సంక్షేమానికి సమాంతరంగా అభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

నిడమర్రు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి సమాంతరంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. శుక్రవారం చానమిల్లిలో రూ1.74 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, నాడు–నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థికంగా భరోసా అందిస్తున్నారన్నారు. మచ్చలేని నాయకునిగా ఉన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్లు, రూ.27.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.5 లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.55 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన మంచినీటి ట్యాంకు, పైపులైను నిర్మాణాలను ప్రారంభించారు. ముందుగా గ్రామ దేవత చల్లాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, సంకు సత్యకుమార్, సర్పంచ్ నంద్యాల ప్రసాద్, ఎంపీటీసీ కొత్తల సింహాచలం, పార్టీ గ్రామ అధ్యక్షుడు గరికిపాటి పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే వాసుబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

పట్టిసీమ ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

పోలవరం రూరల్: పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. పట్టిసం శివక్షేత్రంలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. మహాశివరాత్రికి సుమారు 2 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని డీఎస్పీ ఎస్.సురేష్ కుమార్‌రెడ్డిని ఆదేశించారు. ఇసుక తిన్నెలపై ఏర్పాట్లు, ప్రత్యేక క్యూలైన్‌లను పరిశీలించారు. క్యూలైన్ల వద్ద షామియానాలు, ఇసుక తిన్నెలపై విద్యుత్ అలంకరణ, పంట్లతో కాలిబాట, గజ ఈతగాళ్లు తదితరాలపై సూచనలిచ్చారు. స్నానఘట్టాల వద్ద భక్తులు నదిలో లోతుకు వెళ్లకుండా బారీ కేడింగ్‌లు, పడవలు ఏర్పాటు చేయాలన్నారు. గూటాల నుంచి పోలవరం వరకు ఏటిగట్టుపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. కార్ పార్కింగ్, మోటార్ సైకిల్ పార్కింగ్ ప్రదేశాలను వేర్వేరుగా ఏర్పాట్లు చేయాలన్నారు. సీఐ జి.మధుబాబు, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీరభద్రరావు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

పదోన్నతులకు వినతి

ఏలూరు(మెట్రో): గ్రేడ్–1 వీఆర్వోలను సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఏలూరులో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తాము పదోన్నతులకు అన్ని అర్హతలు కలిగి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌పిఎస్‌ఆర్ చంద్రమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిశోధనలు అన్నదాతలకు ఉపయోగపడాలి



విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: అన్నదాతల హితం కోరేలా పరిశోధనలు ఉండాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. పరిశోధన అంశాలపై శుక్రవారం వర్సిటీ కళాశాల వెంకట్రామన్నగూడెంలో నిర్వహించిన వెబినార్‌లో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. తమ పరిశోధనా ఫలితాలను మంచి పరిశోధాన పత్రం ద్వారా ప్రచురించడం వల్ల అన్నదాతల హితంతో పాటు, ప్రపంచ సాంకేతిక ఫోరంలో ఉనికిని చాటాలని విద్యార్థులకు సూచించారు. ఘాజియాబాద్‌లోని సొసైటీ ఫర్ హార్టికల్చర్ రీసెర్చ్ డెవలప్‌మెంటు మేనేజింగ్ ఎడిటర్ డాక్టర్ సోమదత్ సాంకేతిక అంశాలపై వెబినార్‌లో వివరించారు. ఎంఎస్సీ. పీహెచ్‌డీ విద్యార్థులతోపాటు అసోసియేట్ డీన్ ఎం.మాధవి, అధికారులు పద్మావతమ్మ, సూర్యకుమారి, సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.గంగాధరరావు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తి అరెస్టు

భీమవరం: ప్రేమపేరుతో ఓ మహిళను నమ్మించి లోబర్చుకుని.. పెళ్లిచేసుకోమంటే ముఖం చాటేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. తాడేపల్లిగూడేనికి చెందిన యువతి భీమవరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీ ఫార్మశీ చదువుతుండగా ఆకివీడు మండలం ఐ భీమవరం గ్రామానికి చెందిన ఈదరపల్లి విజయదుర్గాప్రసాద్ అదే కళాశాలలో ఎం ఫార్మశీ చదువుతున్నాడు. గత ఏడాది కాలంగా విజయదుర్గాప్రసాద్ ప్రేమిస్తున్నానంటు ఆ యువతి వెంటపడి లోబర్చుకున్నాడు. పెళ్లి ప్రస్తావన తీసుకురాగానే విముఖత చూపడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు మేరకు కేసు నమోదుచేసి శుక్రవారం విజయదుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు.

బోధనకు అనుసంధానం.. స్విఫ్ట్ చాట్

- సర్కారు బడుల్లో కొనసాగుతున్న డిజిటల్ విప్లవం
- ఇప్పటికే ఐటీసీ బోధనపై టీచర్లకు శిక్షణ
- మరింత మెరుగైన బోధనకు స్విఫ్ట్ చాట్
- ఐఎఫ్‌పీ, బైజూస్ ట్యాబుల్లో అంతర్భాగం ఈ స్విఫ్ట్ అనువర్తనం
- ప్రతి టీచర్ మొబైల్‌లో స్విఫ్ట్ చాట్ యాప్ ఉండేలా చర్యలు

నిడమర్రు: నేడు ఏపీ సర్కారు బడుల్లో డిజిటల్ విప్లవం కొనసాగుతోంది. పాఠశాల విద్యలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులతో బ్లాక్‌బోర్డు, గ్రీన్ చాక్ బోర్డులపై పాఠాలు చెప్పే దశ నుంచి ప్రతి తరగతి గదిలో డిజిటల్ విధానంలో విద్యా బోధన నిర్వహించే స్థాయిలో ఏపీ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడుతున్నాయి. గత విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేసిన స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)లు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అందించిన కంప్యూటర్ ట్యాబ్‌ల వినియోగంపై జిల్లాస్థాయిలో పలు శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయులకు అందించారు. ఈ డిజిటల్ విద్యాబోధన మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు స్విఫ్ట్ చాట్ బాట్ పేరుతో ఓ అనువర్తనాన్ని (యాప్) అనుసంధానం చేస్తూ పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఈ యాప్ విద్యాబోధనలో సహాయకారిగా ఉండేలా రూపొందించారు.

జిల్లాలో 6,408 మంది రిజిస్ట్రేషన్

జిల్లాలో 6,408 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి స్మార్ట్‌ఫోన్లలో ఈ స్విఫ్ట్ చాట్‌బాట్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకునేలా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించిన లింక్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. లింక్‌తోపాటు ఇన్‌స్టలేషన్ ప్రక్రియ సమాచారాన్ని విద్యాశాఖ ఐటీ సెల్ నుంచి డీఈవో కార్యాలయాలకు అందాయి. ఈ యాప్ ఇన్‌స్టాల్ సమయంలో ఏపీ టీచర్ బోట్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. లాంగ్వేజ్‌ను ఎంపిక చేసుకుని తమ రిజిస్టర్ మొబైల్ నంబర్ ఎంటర్ చేసి, విద్యాశాఖనుంచి వచ్చిన ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం స్కూల్ యూడైస్ కోడ్, టీచర్ సీఎఫ్‌ఎంఎస్ ఐడీని నమోదు చేయాల్సి ఉంటుంది. టీచర్ తన వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో ఈ స్విఫ్ట్ చాట్ యాప్‌తో ఎటువంటి ప్రశ్నకైనా సమాధాన్ని రాబట్టుకునేందుకు ఈ నూతన విధానం సులభతరం చేస్తుంది. ఇది అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంపై పనిచేసే విధంగా ఈ యాప్‌ను రూపొందించారు.

ఐటీసీపై సైన్స్, మ్యాథ్స్ టీచర్లకు శిక్షణ

ఇన్ఫర్‌మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీపై (ఐటీసీ) ఇటీవల జిల్లా కేంద్రం ఏలూరులో గణితం, సైన్స్ బోధించే ప్రతి టీచర్‌కు ఈ స్విఫ్ట్ యాప్, ఓల్యాబ్స్, ఆర్టిఫిషియల్ ఇంటిల్‌జెంట్ అసిస్టెంట్ ఫర్ టీచర్స్, చాట్ జీపీటీ వంటి యాప్స్, వెబ్‌సైట్లపై అవగాహనా శిక్షణ తరగతులు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. ఈ స్విఫ్ట్ చాట్ యాప్ పాఠశాలలకు సరఫరా చేసిన ఐఎఫ్‌పీలు, 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా అందించిన ట్యాబ్‌లలో ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఉంది.



జల్లికొమ్మర స్కూల్లో స్విఫ్ట్ చాట్ యాప్ ద్వారా సైన్స్ పాఠం బోధిస్తున్న టీచర్ సౌజన్య



ట్యాబుల్లో స్విఫ్ట్ చాట్ యాప్‌తో లెక్కల క్విజ్‌లో పాల్గొంటున్న 8వ తరగతి విద్యార్థులు

స్విఫ్ట్ చాట్ ప్రత్యేకతలు ఇవీ

SwiftChat

తెలియని అంశాన్ని వాట్సాప్ చాట్ మాదిరిగా ఈ స్విఫ్ట్ చాట్‌లో ఎస్ఎంఎస్ చేస్తే క్షణంలో దానికి సమాధానం ప్రత్యక్షమవుతుంది. అలాగే ఈ యాప్‌లో 1నుంచి 10వ తరగతి వారీగా డిజిటల్ తరగతులు, లైవ్ క్విజ్‌లు, కాంపిటీషన్ జోన్, స్కిల్ కార్నర్‌లు, రివార్డులు ఈ యాప్‌లో పొందుపరిచారు. నచ్చిన అంశాన్ని సేవ్ ఐటమ్స్‌లో స్టోర్ చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఒకటి, రెండు తరగతుల గణితం, మూడు నుంచి పదో తరగతి వరకూ గణితం, సైన్స్ సబ్జెక్టులపై మాత్రమే డిజిటల్ తరగతులు, క్విజ్‌లు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన సబ్జెక్టులపై కూడా భవిష్యత్‌లో డిజిటల్ క్లాసులు పొందుపర్చనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

నూరుశాతం రిజిస్ట్రేషన్ పూర్తి



జిల్లాలో 6408 మంది టీచర్లకి 6401 మంది స్విఫ్ట్ యాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఉన్నత పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులతో 6వ తరగతి పరిసరాల విజ్ఞానం సబ్జెక్ట్‌పై యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. ఉన్నత అధికారులు మినిమం టైమ్ స్కేల్ టీచర్స్‌కు మినహాయింపు ఇచ్చారు.

– ఎస్.అబ్రహం, డీఈవో, ఏలూరు జిల్లా

భవిష్యత్తులో మరింత మెరుగులు దిద్దేలా



స్మార్ట్ ఫోన్స్ ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో స్విఫ్ట్ చాట్ యాప్ గురించి అవగాహన కల్పించేలా కృషి చేయమని హెచ్‌ఎంలకు సూచించాము. జిల్లాలో ఇప్పటి వరకూ 1216 ఐఎఫ్‌బీలు, 394 స్మార్ట్ టీవీలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌ను భవిష్యత్‌లో మరింత మెరుగులు దిద్దేలా విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది.

– సబ్బిత నరసింహమూర్తి, ఎంఈవో, పెదపాడు

గణితంపై క్విజ్‌లు సరదాగా ఉన్నాయి



గణితంపై ఉన్న క్విజ్‌లు, టాస్కులు సరదాగా ఉన్నాయి. జవాబులు, మార్కులు కూడా వెంటనే ప్రత్యక్షమవుతున్నాయి. ఉపాధ్యాయులు ఐఎఫ్‌పీల్లో ఉన్న స్విఫ్ట్ చార్ట్‌తో గణితం, సైన్స్‌పై ఉన్న డిజిటల్ వీడియోలు చూపిస్తున్నారు. గ్రూపులుగా ఆన్‌లైన్‌లో టాస్కులు పూర్తి చేస్తున్నాము.

– మద్దాల సంధ్య, 8వ తరగతి విద్యార్థిని

యాదవులకు ప్రాధాన్యతపై సర్వత్రా హర్షం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత యాదవ సంఘం ఏలూరు జిల్లా నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు అన్ని అంశాల్లో వైఎస్సార్ సీపీ అధిక ప్రాధాన్యత ఇస్తుండడంపై అఖిల భారత యాదవ మహాసభ ఏలూరు జిల్లా కమిటీ నాయకులు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, ఏలూరు నగర అధ్యక్షుడు బొట్టా అజయ్‌కుమార్ మాట్లాడారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో ఏలూరు, నరసరావుపేట ఎంపీ స్థానాలు, పలు ఎమ్మెల్యే స్థానాలు యాదవులకు కేటాయించడం గొప్ప విషయమన్నారు. తాజాగా నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుల నియామకాలలో యాదవులకు పెద్ద పీట వేశారంటూ సంతోషం వ్యక్తం చేశారు. దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులుగా తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు నెరుసు నాగసత్యం యాదవ్‌ను, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకునిగా మురుగుడు సూర్యనారాయణ యాదవ్‌ను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. యాదవ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు శ్రీనివాసరావు(బుజ్జి)ని ఏలూరు నగర వైఎస్సార్ సీపీ కార్యదర్శిగా నియమించిన ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో యాదవ సామాజిక వర్గానికి ఎంతో గుర్తింపు లభించిందని, దీనికి కృతజ్ఞతగా వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఘంటా ప్రసాదరావును ఏలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకునిగా నియమించడంపై జిల్లా యాదవ సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు కిలారపు శ్రీనివాసరావు(బుజ్జి), జిల్లా కోశాధికారి గొర్ల రామారావు, దెందులూరు నియోజకవర్గ యాదవ సంఘం కన్వీనర్ దిమ్మిటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో దేశవాళీ వరి రకాలే మేలు



కేవీకేలో మాట్లాడుతున్న మార్టేరు వరి పరిశోధనా స్థానం బ్రీడింగ్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ చారుమతి

ఉండి: ప్రకృతి వ్యవసాయంలో రైతులకు దేశవాళి వరిరకాలే మేలు చేస్తాయని మార్టేరు వరి పరిశోధనా స్థానం బ్రీడింగ్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ఎం.చారుమతి అన్నారు. శుక్రవారం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చారుమతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా అటు రైతులకు, ఇటు ప్రజలకు చాలా మంచి జరుగుతుందన్నారు. ఈ సాగులో శాస్త్రవేత్తల సూచనలతో దేశవాళీ వరి రకాలను వినియోగిస్తే రైతులు మంచి లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కేవీకే హెడ్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన పర్యావరణాన్ని, భూసారాన్ని కాపాడుకుంటూ సాగుఖర్చులు తగ్గించుకుని రైతులు లాభాల బాటలో ఉంటారన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై నూకరాజు మాట్లాడుతూ రైతులు బయోకల్చర్‌ను విరివిగా ఉపయోగిస్తే పంటలో పురుగులు, తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిర దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం సమష్టిగా చేసినట్లయితే ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి బీ సంధ్య సూచించారు. రైతులకు ఏమైనా అనుమానాలు ఉంటే వ్యవసాయాధికారులను, ఆర్‌బీకేలో ఉండే అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను లేదా శాస్త్రవేత్తలను సంప్రదించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో పంట యాజమాన్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పీ వినయ లక్ష్మి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ రాజేష్, డాక్టర్ ఎస్ దెబోరామెస్సియానా, బీ రజిత, రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతుల మార్పులపై అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శశి ఇంజినీరింగ్ కళాశాల వైస్‌చైర్మన్ మేకా నరేంద్ర, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్

తాడేపల్లిగూడెం: సాంకేతిక పురోగతుల మార్పులపై చర్చించేందుకు మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు శశి ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఈ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, విద్యార్థులు, అధ్యాపకులు 1200 సాంకేతిక రీసెర్చ్ పేపర్లు పంపించారన్నారు. వీటిలో 170 పేపర్లను ఐఈఈఈ ఎంపిక చేసిందన్నారు. సామాజిక స్థిరమైన ఆవిష్కరణలపై జరిగే ఈ సదస్సులో భాగంగా శుక్రవారం వర్క్‌షాప్ ఆన్ ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీపై ఎలక్ట్రిక్ వెహికల్ రెట్రాన్ ఎనర్జీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు రీసోర్స్‌పర్సన్ దీపేష్‌కుమార్ వివరించారు. ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వెహికల్ డొమైన్, ఉత్తమ అభ్యాసాలు , సాంకేతిక పురోగతులపై వివరించారు. ఎస్‌పీఐటీ ముంబై రీసెర్చ్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, ఈసీఈ డిపార్టుమెంటుకు చెందిన టీవీ.రెడ్డి, ఐఐటీ ఖర్గ్‌పూర్‌కు చెందిన ముఖేష్ తదితరులు వివిధ విషయాలపై తెలియజేశారు. ఐఈఈఈ కాన్ఫరెన్సు చైర్మన్ డాక్టర్ శివకుమార్, డాక్టర్ ఏ.ప్రసాద్, బి.కృష్ణమూర్తి, నవీన్ కుమార్, నాగేంద్రనాధ్, కోఆర్డినేటర్లు హాజరయ్యారు. సోమవారం వరకు ఈ సదస్సు జరుగనుంది.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన శిరీష

తణుకు : భర్త వేధింపులు తాళలేక మనస్తాపం చెందిన వివాహిత చింతపల్లి శిరీష (26) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తణుకు మండలం పైడిపర్రులో శుక్రవారం చోటుచేసుకుంది. తణుకు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి మండలం పాలి గ్రామానికి చెందిన చింతపల్లి సత్యనారాయణకు, పైడిపర్రు డ్రైవర్స్ కాలనీకు చెందిన శిరీషకు 2019లో వివాహమైంది. అప్పటి నుంచి శిరీషను మానసికంగా, శారీరకంగా వేధిస్తుండటంతో ఇరువురి కుటుంబాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం పుట్టింటికి వచ్చిన శిరీష తిరిగి వెళ్లలేదు. గురువారం సత్యనారాయణ, భార్య పుట్టింటికి వచ్చి ఆమెతో ఘర్షణ పడి రెండేళ్ల కుమారుడిని తనతోపాటు తీసుకెళ్లిపోయాడు. శిరీషకు ఫోన్ చేసి ఇకపై కొడుకును తీసుకురానని చెప్పడంతో కలత చెందిన ఆమె మనస్తాపంతో ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి కడలి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న గట్టిం మాణిక్యాలరావు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు కొనియాడారు. ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం సత్యవతినగర్‌లోని రోడ్డు నెంబర్ 9లోని శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమంలో జరిగింది. పాలకొల్లు వలంటరీ బ్లడ్ బ్యాంక్ నుంచి వచ్చిన పీఎంజేఎఫ్ ఎంవీ సత్యనారాయణ, సిబ్బంది ఆధ్వర్యంలో 25 మంది యోగా సాధకులు, స్థానిక దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కరిబండి రామకృష్ణ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జగన్, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు హాజరైయారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెంటపాడు: అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సరస్వతీ పేర్కొన్నారు. మండలంలో జట్లపాలెం-1(ఎస్సీ), పెంటపాడు-3(బీసీ-ఎ), మౌంజీపాడు-1(ఓపెన్), పోస్టులకు గాను రోస్టర్ పాయింట్ల ఆధారంగా స్థానికులైన వివాహిత మహిళలు, అర్హత సాధించిన పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. మార్చి 1 తేదీ నాటికి ప్రతిపాదులోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో హాజరు కావాలని కోరారు.

సామూహిక శ్రీలక్ష్మి పారాయణం, గంగా హారతి



గంగా హారతి ఇస్తున్న మహిళా భక్తులు, చిన్నారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాఘ పౌర్ణమి సందర్భంగా ఏలూరు కాలువ వద్ద శుక్రవారం రాత్రి గోదావరి మాతకు పంచ హారతులు ఇచ్చారు. స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణమందిరంలో సామూహిక శ్రీలక్ష్మి, మణి ద్వీపవర్ణన, అష్టలక్ష్మి పారాయణం జరిగింది. సాయంత్రం రుక్మిణి కళ్యాణం పారాయణం, దీపపు ప్రమిదలతో శోభాయాత్రలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలపాక సుబ్రహ్మణ్యం, ఇందుకూరి మోహన్‌రాజులు పర్యవేక్షించారు. మహిళా భక్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఈ-కేవైసీ ప్రక్రియ

అత్తిలి: దాళ్వాపంట, ఈ పంట నమోదుకు సంబంధించి ఈ కేవైసీ ప్రక్రియ శనివారంతో ముగుస్తుందని మండల వ్యవసాయశాఖాధికారి టీకే రాజేష్ ప్రకటనలో తెలిపారు. ఈ-కేవైసీ చేయించుకోని రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ-క్రాప్‌లో ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్ముడానికి, పంట నష్ట పరిహారం, సున్నావడ్డీ, క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తాయని ఏఓ రాజేష్ తెలిపారు.

మాదిగలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ జరిగితే మాదిగలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చునని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణకు కట్టుబడి ఉన్న పార్టీలకే మాదిగలు మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, వి.సిద్ధూ, జిల్లా నాయకులు చెప్పులు వాసు, కొల్లి రాజశేఖర్, సీహెచ్ ఝాన్సీ, విజయ, లంక రాజశేకర్, డి.శివాజీ, గాలింకి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం పక్షవాతం, ఫిట్స్, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన డాక్టర్ గోపాళం శివన్నారాయణ మెడికల్ క్యాంపులో వైద్యులు డాక్టర్ యస్.పూర్ణచంద్, జి.సత్యనారయణరాజు తదితరులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు.

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సేవలు భేష్

- సేవల పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్న పేదరోగులు
- నిత్యం 500లకు పైగా అవుట్ పేషెంట్స్

తణుకు అర్బన్: తణుకు పరిసర ప్రాంత గ్రామాల ప్రజానీకానికి పెద్దాసుపత్రిగా 150 పడకలతో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అందిస్తున్న వైద్యసేవలు అజరామజరంగా నిలుస్తున్నాయి. విద్య, వైద్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు తగ్గట్లుగా అత్యున్నత స్థాయి వైద్యసేవలందిస్తూ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుస్తోంది తణుకు ఆస్పత్రి. జిల్లా నలుమూలల నుంచి వైద్యం కోసం అధిక శాతం రోగులు తణుకు ఆస్పత్రికి వస్తుంటారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్ర ఆస్పత్రిగా రూపుదాల్చిన ఈ ఆస్పత్రికి మెజారిటీ స్థాయిలో వైద్యులతోపాటు వైద్యసిబ్బంది కూడా అందుబాటులోకి వచ్చారు. ఆస్పత్రిలో రోగులకు వైద్యవర్గాలు అందిస్తున్న అత్యున్నత సేవల కారణంగా రాష్ట్రంలో జిల్లా ఆస్పత్రి కేటగిరీలో సైతం పలు విభాగాల్లో 450 పడకలున్న ఆస్పత్రులను దాటుకుని మొదటి స్థానంలో నిలుస్తుండడం గర్వకారణంగా నిలుస్తోంది.



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

అవార్డులకు పుట్టినిల్లుగా...

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అవార్డులకు పుట్టినిల్లుగా ఎన్నోసార్లు పలు అవార్డులను సొంతం చేసుకుంది. తణుకు ఏరియా ఆస్పత్రిగా ఉన్ననాటి నుంచి ఆస్పత్రిలో అందిన వైద్యసేవలతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనానికి సైతం పలు అవార్డులు దక్కాయి. దీంతో తణుకు ప్రభుత్వ ఆస్పత్రి ఖ్యాతి రాష్ట్రంలోనే చర్చించుకునే స్థాయికి ఎదిగింది. గత టీడీపీ హయాంలో ఆస్పత్రిలో చాలా సమస్యలు ఉత్పన్నమవ్వగా కొంతమేర సేవలు కుంటుపడ్డాయి. అప్పట్లో పేద ప్రజలకు అందాల్సిన వైద్యసేవలు టీడీపీ నాయకుల పెత్తందారీ జోక్యం వ్యవహారంతో పాటు వైద్యవర్గాలను గుప్పెట్లో పెట్టుకునే రాజకీయాన్ని ఆస్పత్రిపై కూడా రుద్దడంతో ఇటు ప్రజల నుంచి అటు వైద్యవర్గాల నుంచి కూడా విమర్శలు వెల్లువెత్తాయి. 2019లో ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తణుకులో ప్రస్తుత రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వైద్యవర్గాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. వైద్యవర్గాలపై తమ పెత్తనం ఏమీ ఉండదని మీరంతా స్వేచ్ఛగా విధులు నిర్వర్తిస్తూ పేదరోగులకు మంచి నాణ్యమైన వైద్యసేవలు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

నిత్యం 500లకు పైగా ఓపీ

ఆస్పత్రిలో అన్ని చికిత్సలు అందుబాటులో ఉండడంతో ప్రతిరోజూ 500లకు పైగా అవుట్ పేషెంట్స్ వస్తుంటారు. అంతేకాకుండా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న 150 పడకలు నిత్యం ఫుల్ అయి ఉంటాయి. ముఖ్యంగా ప్రసూతి, జనరల్ సర్జరీ విభాగాల్లో తణుకు ఆస్పత్రి విశేష సేవలందిస్తుండగా ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, కళ్లు, డెంటల్, మానసిక వైద్యం, చర్మ వ్యాధులు, పీడియాట్రిక్ విభాగాల్లో సైతం నాణ్యమైన వైద్యసేవలందుతున్నాయి. ఇటీవలే ఆస్పత్రి ఓపీ విభాగం నుంచి వైద్యసేవల వరకు అందచేస్తున్న డిజిటల్ సేవలకు గాను తణుకు ఆస్పత్రి రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని సాధించి రూ. 8.50 లక్షలు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక నగదు పొందేందుకు అర్హత సాధించింది. అయితే రానున్న పది రోజుల్లో వివిధ పోస్టుల్లో ఉన్న కొద్ది ఖాళీలు సైతం భర్తీ కానున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

వైద్య వర్గాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చాం



మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని పూర్తిగా ప్రక్షాళన చేశాం. వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంతోపాటు వైద్యవర్గాలకు పూర్తిస్వేచ్ఛనిచ్చాం. గత ప్రభుత్వ హయాంలో వైద్యవర్గాలపై ఉన్న పెత్తందారీ తనాన్ని తొలగించి మీ విధుల్లో మీరు నాణ్యమైన వైద్యసేవలందించాల్సిందిగా సూచించాను. దీంతో వైద్యులు, సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ పేదల అభినందనలు అందుకుంటూ మంచి ఫలితాలు రాబడుతున్నారు. పేదలపాలిట ధర్మాసుపత్రిగా తణుకు ఆస్పత్రి కీర్తిప్రతిష్టలు సాధిస్తుంది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

పూర్తిస్థాయి పర్యవేక్షణ



ఆస్పత్రికి వచ్చిన రోగి తనకు అవసరమైన వైద్యసేవలు పొంది సంతోషంగా ఇంటికి చేరే విధంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యసేవలు నాణ్యంగా అందుతున్నాయి. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. రోగుల నుంచి సలహాలు, ఫిర్యాదులు ప్రత్యేక కంప్‌లెయింట్ బాక్స్ ద్వారా స్వీకరించి సేవలను మెరుగుపరుస్తున్నాం. పారిశుద్ధ్యం, సెక్యూరిటీ విభాగాలను ప్రతిరోజూ పరిశీలిస్తున్నాం.

– డాక్టర్ వెలగల అరుణ, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

ఆస్పత్రిలో సేవలు అమోఘం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలు పేదరోగుల మన్ననలు పొందుతున్నారు. మంత్రి కారుమూరి తనదైన శైలిలో వ్యవహరిస్తూ ఆస్పత్రికి వసతులను కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఏ విభాగంలోనూ అవినీతికి తావులేకుండా వైద్యసేవలందుతున్నాయి. గతంలో అవినీతికిపాల్పడిన వైద్యవర్గాలపై కఠినంగా వ్యవహరించి బయటకు పంపించాం.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు

ఘనంగా గోగులమ్మ జాతర మహోత్సవం



గోగులమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో గోగులమ్మ జాతర మహోత్సవాలు గురువారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయం నుంచి వివిధ కూడళ్లలో ఉత్సవాలకు సంబంధించిన వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ బాణా సంచాతో వివిధ ప్రాంతాలకు చెందిన జాన పద నృత్యాలతో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు సతీష్ రాజు, నాయకులు భూపతిరాజు రామకృష్ణంరాజు, దారం శ్రీను, వీరవల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల చేసిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం ప్రారంభించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయం శుక్రవారం తెలిపింది.

పండగలా ప్రారంభోత్సవాలు



కొమ్ముగూడెం గ్రామంలో వీరంపాలెం - నవాబుపాలెం బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతులమీదుగా పండుగలా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని ఎల్.అగ్రహారం, పట్టింపాలెం, కొమ్ముగూడెం, కొత్తూరు, ఆరుగొలను, దండగర్ర ఉప్పరగూడెం, జగ్గన్నపేట, పెదతాడేపల్లి తదితర గ్రామాల్లో సుమారు రూ.17.27కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ - జనసేనలకు మాత్రం వారి హయాంలో చేసింది చెప్పుకోవడానికి ఏం లేదన్నారు. టీడీపీ హయాంలో, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు. ప్రజల అవసరాలపై తనకు అవగాహన ఉందన్నారు. ఆయా కార్యక్రమాలకు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఇలా..

తాడేపల్లిగూడెం మండలంలో రూ.17.27కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రారంభోత్సవ, శంకుస్థాపనలు చేశారు. ఎల్.అగ్రహారంలో రూ.20.80లక్షలతో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం, పట్టింపాలెంలో రూ.23.94కోట్లతో ఆర్బీకే, పెదతాడేపల్లి-2 పరిధిలో రూ.43.60లక్షలతో ఆర్బీకే, సచివాలయం భవనాలు, జగ్గన్నపేటలో రూ.20.80లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, ఉప్పరగూడెంలో రూ.20.80లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, కొత్తూరులో రూ.20.80లక్షలతో హెల్త్ క్లీనిక్, ఆరుగొలను సొసైటీలో రూ.55లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్‌లను ఆయన ప్రారంభించారు. కొమ్ముగూడెంలో వీరంపాలెం నుంచి త్యాజంపూడి వరకు రూ.14.95 కోట్లుతో నిర్మించనున్న పీఎంజీఎస్‌వై బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఎంపీటీసీలు మార్లపూడి సుబ్బారావు, జంపెల్ల సత్యవతి, నార్ని శంకరరావు, సర్పంచ్‌లు చింతా వెంకట్రావు, తాడేపల్లి బేబి, దండే కనకబాబు, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, అడపా అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, పరిమి తులసీదాస్, చిక్కాల సత్యనారాయణ, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, పీఆర్ డీఈ మీఎస్.వేణుగోపాల్, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఎంపీడీవో ఎస్ఎస్.శర్మ, డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి



తణుకులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తణుకు మున్సిపాల్టీ పరిధిలోని వంగవీటి మోహనరంగా వీధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కేంద్రం సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలంతా ఫ్రైడేను డ్రైడేగా పాటించే విధంగా సిబ్బంది అంతా కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా దోమకాటు ద్వారా తలెత్తే ఇబ్బందులను ప్రజలకు తెలియ జెప్పాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో దోమ పుట్టుకకు అవసరం లేని నీటినిల్వలే కారణమనే విషయాన్ని ప్రజలకు చేరువచేసి అటువంటి నీటినిల్వలను తొలగించేందుకు పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి దోమల వ్యాప్తి, దోమల ద్వారా వ్యాపించే రోగాలను ప్రజలకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు బి.వెంకటరమణ, కె.అనూష సువర్ణ, ఆరోగ్య సహాయకులు ఎస్.తాతాజీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ డా.అనపర్తి శామ్యూల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ డా.అనపర్తి శామ్యూల్ అన్నారు. శుక్రవారం పట్టణ టాస్క్ ఫోర్స్ సమావేశం కమిషనర్ మాట్లాడుతూ మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో విజయవంతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులను గుర్తించడంలో సిబ్బంది అలసత్వం వహించరాదన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సిబ్బంది సమన్వయం పరుచుకుంటూ పల్స్ పోలియో విజయవంతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అర్బన్ నోడల్ అధికారి డాక్టర్ రవి కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు, అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ అనుషిత, డాక్టర్ తనూజ, డాక్టర్ ఆషాలత తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే జనరిక్ మందులు



ఇరగవరంలో జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: జనరిక్ మందుల దుకాణాల ద్వారా ప్రజలకు తక్కువ ధరలకే మందులు లభిస్తాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఇరగవరం సహకార సంఘ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జనరిక్ మందుల దుకాణంలో 70శాతం తక్కువ ధరకు మందులు లభిస్తాయని, ప్రజలు జనరిక్ మందులను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండలపార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు మంగెన రామానాయుడు, పాలా పాలేశ్వరరావు, తణుకు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు కిశోర్, సొసైటీ సెక్రటరీ ఏలూరి నాగపెద్దిరాజు, పాలకవర్గ సభ్యులు జుత్తిగ నరశింహమూర్తి, గనసాల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడులు అమానుషం



ఇరగవరంలో నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ఇరగవరం: ఢిల్లీ సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు చేస్తున్న ఆందోళనలపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తోందని రైతు, కార్మిక సంఘ నాయకుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇరగవరం మండల కేంద్రంలో రైతు సంఘ నాయకులు మృతి చెందిన రైతుకు సంతాపం తెలుపుతూ బీజేపీ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు మాట్లాడుతూ రైతుల సమస్యల కోసం పోరాటాలు చేస్తుంటే ఉగ్రవాదులుగా రైతులను కేంద్ర ప్రభుత్వం చిత్రీకరించడం సరికాదన్నారు. అనంత స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుల పర్తి సత్యనారాయణ, ముసలయ్య, పిన్ని కోటేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, కేత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



ఇరగవరం: ఎస్ ఇల్లిందలపర్రులో జగనన్న ఆరోగ్యసురక్షలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



తణుకు టౌన్: దువ్వలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, తదితరులు



అత్తిలి: కంచుమర్రులో రోగులకు మందులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇరగవరం: జగనన్న ఆరోగ్యసురక్ష పేదలకు వరమని సర్పంచ్ మట్టా నాగమణి అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలం ఎస్ ఇల్లిందలపర్రు గ్రామ సచివాలయంలో 2వ విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైద్యశిబిరంలో 373 మందికి వైద్యపరీక్షలు జరిపారు. వైద్యులు డాక్టర్ నిమ్మల సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సాయిగిరిరెడ్డి, డాక్టర్ దుర్గాభవాని వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిల్లి కాంతకుమారి, ఎంపీడీవో కె పద్మజ్యోతి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో 402 మందికి వైద్య పరీక్షలు

తణుకు టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో గ్రామంలోని 402 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల ఈవోపీఆర్‌డీ ఏఎస్ రామకోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం దువ్వ గ్రామంలోని 2వ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఈశిబిరాన్ని ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా సూర్యనారాయణమూర్తి (అడ్డా బాబు) ప్రారంభించారు. ఈ శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు అవసరమైన చికిత్సకు ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేసేందుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరంలో మొత్తం 402 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 205 మంది మహిళలు, 186 మంది పురుషులు, 11 మంది పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 31 మందికి ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహించారు. ఉప సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, వైద్యులు డాక్టర్ కే కీర్తి, డాక్టర్ డీ రమేష్, వై సంహిత, కె సాయిభవానీ, గ్రామ కార్యదర్శి నరశింహమూర్తి, వైద్య సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

అత్తిలి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 2వ విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు పెన్మెత్స వెంకటపతిరాజు అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం కంచుమర్రు సచివాలయం వద్ద 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యశిబిరంలో 284మందికి సాధారణ వైద్య పరీక్షలు జరిపారు. 12 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ పి కిరణ్, డాక్టర్ జ్యోతికృష్ణ, డాక్టర్ జి శ్రీనివాసరాజు, నేత్ర వైద్యనిపుణుడు కెఎస్‌కే రామిరెడ్డిలు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తపు నాగేంద్ర శ్రీనివాస్, ఉపసర్పంచ్ వానపల్లి యాకోబు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, సెక్రటరీ జి భాస్కర్, వీఆర్వో బీఎస్‌వీ రత్నారావు, ఎంపీహెచ్ఈఓ కె శాంతమూర్తి, ఎంవీడీవీ ప్రసాద్, సూపర్ వైజర్లు టీవీవీ ప్రసాద్, జి మరియమ్మ, ఆశా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో తణుకు విద్యార్థి ప్రతిభ

తణుకు టౌన్: తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో తణుకు సరోజనీదేవి కాలేజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థినీ కేకే ఉషశ్రీ దుర్గా తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ సౌత్ జోన్ ఆర్టిస్టిక్ సోలో ఈవెంట్‌లో తమ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న కేకే ఉషశ్రీ దుర్గ జాతీయ స్థాయిలో మూడవ స్థానంలో సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఎంబీఏ హెడ్ కె సురేష్ కుమార్, ఇతర అధ్యాపక సిబ్బంది విద్యార్థినీ అభినందించారు.

29న ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు

భీమవరం: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సును ఈ నెల 29న భీమవరం పట్టణం వీరమ్మ పార్క్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త గోళ్ళమూడి రాజసుందరబాబు చెప్పారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ చట్టం 1989, సవరణల చట్టం 2015, 2018-ఎస్సీ ఎస్టీ రూల్స్, సంబంధిత జీఓలపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. అవగాహన సదస్సుకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, ఎస్పీ వేజెండ్ల అజిత, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొంటున్నారన్నారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను విడుదల చేశారు.

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం

పెంటపాడు: గ్రామంలో అన్ని రహదారులకు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ తెలిపారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అందించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ పెంటపాడుకు అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి వార్డు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఇప్పటికే పలు రోడ్లు, డ్రెయిన్లకు నిధులు అందజేశారని తెలిపారు. కునాకరపేటలో రూ.8లక్షలతో డ్రెయిన్ నిర్మాణానికి సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్ వేసుదాసుతో కలిపి శంకుస్థాపనలు చేశారు. ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కర్రి వరాహాలరెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కర రెడ్డి, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబీ, సుబ్బారావు,రెడ్డి శ్రీను, కర్రి పృథ్వీ, ఉండ్రాజవరపు గోపి, చదలవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.